క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో మార్చి 1న విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. ఎల్‌బీ.నగర్, తిలక్ రోడ్డు, సర్వంపేట రోడ్డు, లోతుకుంట, షాదీఖానా, ఈఎస్ఐ ఆస్పత్రి, ఎస్ఆర్‌టీ కాలనీ, టీఆర్‌టీ కాలనీ, జాన్‌పీరీలు, శిలానగర్, ఆయుర్వేదిక్ కళాశాల, 100 ఫీట్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సైన్స్‌ల్యాబ్ ప్రారంభం

విద్యారణ్యపురి: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ జులైవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శన, అలాగే పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్‌ల్యాబ్‌ను హనుమకొండ జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసస్వామి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళి పురోభివృద్ధికి సైన్స్, సాంకేతిక రంగాల అభివృద్ధే కారణమన్నారు. చిన్నప్పటి నుంచే విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్ఎం భాస్కర్ రెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు వీరయ్య, సత్యనారాయణ రావు పాల్గొన్నారు.

కండక్టర్ నిజాయితీ



కాజీపేట: బస్సులో దొరికిన బంగారు బ్రాస్‌లెట్‌ను బాధితుడికి అందించి ఆర్టీసీ కండక్టర్ తన నిజాయితీ చాటుకున్నారు. కాజీపేట నుంచి జనగామకు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన ప్రేమ్‌కుమార్ బ్రాస్‌లెట్ కిందపడిపోయింది. దాన్ని గుర్తించిన కండక్టర్ రాజయ్య.. కాజీపేట పోలీసులకు సమాచారం ఇచ్చి బాధితుడు ప్రేమ్‌కుమార్‌కు అందజేశారు. ఈమేరకు కండక్టర్ రాజయ్యను సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్సై నవీన్ కుమార్ అభినందించారు.

నిరుపేదలకు సేవ చేయడమే ధ్యేయం



న్యూశాయంపేట: నిరుపేదలకు సేవ చేయడమే తమ ధ్యేయమని పబ్లిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మహ్మద్ హబీబుద్దీన్ అన్నారు. హనుమకొండ వడ్డేపల్లిలోని కార్యాలయంలో వైద్య చికిత్సల నిమిత్తం పలువురు నిరుపేదలకు రూ.10 వేల చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. సంస్థ ఉపాధ్యక్షుడు ఎజాజ్, సెక్రటరీ మహ్మద్ అన్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ సలీం పాల్గొన్నారు.

గుడి అభివృద్ధికి చేయూత



మామునూరు: వరంగల్ నక్కలపల్లి గ్రామంలో నిర్మిస్తున్న పోచమ్మ ఆలయ అభివృద్ధి పనులకు వాసవి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ఎలగందుల అమృత వృద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎలగందుల లక్ష్మీనారాయణ చేయూతనిచ్చారు. ఈమేరకు పోచమ్మ ఆలయాన్ని శుక్రవారం సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. వాసవి ట్రస్ట్ నిర్వహణ కార్యదర్శి ఎలగందుల శ్రీనివాస్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు రాజేంద్ర ప్రసాద్, లక్ష్మీనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

'శ్వేతార్క'లో చండీహోమం



కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో నిత్య మాసోత్సవ చండీ హోమాన్ని శుక్రవారం నిర్వహించారు. అర్చకుడు మణికంఠ శర్మ ఆధ్వర్యంలో జరిగిన హోమంలో ఆలయ కార్యకర్తలతో పాటు భక్తులు పాల్గొన్నారు. హోమంలో అయినవోలు సాయికృష్ణ శర్మ, రజిత, సాయికుమారి, ఉమాదేవి, విజయకోటి, సులోచన, సునంద తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి ఉత్సవాలు

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటలో ప్రపంచశాంతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శారద వీఎన్ హైస్కూల్ ప్రిన్సిపాల్ భూపాల్ రావు అధ్యక్షతన ప్రపంచ శాంతి ఉత్సవాలు శుక్రవారం జరిగాయి. వరంగల్ శాంతి ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి మండల పరశురాములు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ గుండు ఉమాదేవి, స్వేచ్ఛ, గౌతమి, రమ్య పాల్గొన్నారు.

ఒంటికి, రెంటికీ తప్పని తిప్పలు

- బస్టాండ్‌లో నిరుపయోగంగా మూత్రశాలలు
- ప్రయాణికుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



మూత్రశాలలకు వెళ్లే దారిలో వేసిన ముళ్లకంప

కమలాపూర్ : ఒకప్పటి నియోజకవర్గ కేంద్రమైన కమలాపూర్ నుంచి నిత్యం వేలాది మంది వరంగల్, హనుమకొండ, హుజూరాబాద్, పరకాల, జమ్మికుంట తదితర పట్టణాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్టీసీకి కూడా ఇక్కడి నుంచి ఆదాయం భారీగానే సమకూరుతుంది. అయినా ప్రయాణికుల గురించి పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. నిధుల లేమితో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం కాస్తా మధ్యలోనే నిలిచిపోగా, కనీసం బస్టాండ్ ప్రాంతంలో మూత్రశాలలు, మరుగుదొడ్లు కూడా కరువయ్యాయి. దీంతో ఇక్కడి నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికులు ఒకటి, రెండుకు అగచాట్లు పడాల్సిన దుస్థితి నెలకొంది.

మూత్రశాలలకు వెళ్లకుండా ముళ్లకంప..

కమలాపూర్ బస్టాండ్ ప్రాంతంలో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక ప్రయాణికులు మల, మూత్ర విసర్జనకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఇబ్బందులు తొలగించడానికి సుమారు తొమ్మిదేళ్ల క్రితం రూ.18 లక్షల అంచనా వ్యయంతో స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. కానీ ప్రస్తుతం మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ మెయింటెనెన్స్ చేసేవారు లేకపోవడంతో వాటిలోకి ఎవరూ వెళ్లకుండా అధికారులు ముళ్లకంపలు అడ్డుగా వేశారు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి. విధిలేని పరిస్థితుల్లో ప్రయాణికులు, ఆటో డ్రైవర్లు, స్థానికులు పలువురు బస్టాండ్ ప్రాంతంలో బహిరంగ మూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో బస్టాండ్ సమీపం దుర్వాసనతో కంపు కొడుతుందని, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు తప్పడం లేదు



బస్టాండ్ ప్రాంతంలో మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించినప్పటికీ వినియోగంలోకి తేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. విధిలేని పరిస్థితుల్లో పలువురు బస్టాండ్ ప్రాంతంలో బహిరంగ మూత్ర విసర్జన చేస్తుండగా మహిళల పరిస్థితి వర్ణణాతీతం. మూత్రశాలలు, మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలి.

\- జనగాని భిక్షపతి, ఆటోడ్రైవర్

అధికారులు స్పందించాలి



ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్ ప్రాంతంలో మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించారని సంతోషించాం. కానీ మెయింటెనెన్స్ లేని కారణంగా వాటిని వినియోగంలోకి తేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా వాటిని వినియోగంలోకి తీసుకురావాలి. అధికారులు వెంటనే స్పందించాలి.

\- పుల్ల హేమంత్‌కుమార్, ప్రయాణికుడు

మండలస్థాయి గణిత ప్రతిభా పోటీలు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఐనవోలు : ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు మండల స్థాయి ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించినట్లు కాంప్లెక్స్ హెచ్ఎం వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రాథమిక స్థాయిలో 2వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఇప్పటి వరకు ఇలాంటి పోటీలు జరగలేదన్నారు. చిన్న పిల్లల్లో కాంపిటీషన్ స్పిరిట్ పెంపొందించే విధంగా ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. తెలుగులో క్లెం శృతి (ఐనవోలు), అవంతిక (ఒంటిమామిడిపల్లి), గ్రేసి (కొండపర్తి), మనితేజ (సింగారం), ఆంగ్లంలో జేఎస్ మేరి (వెంకటాపురం), అవంతిక (ఐనవోలు), అక్షయ(కొండపర్తి), కె.అవినాధ్(ఐనవోలు), అలాగే గణితంలో సహస్ర (గర్మిళ్లపల్లి), ప్రణతి (కొండపర్తి), శ్రీవిద్య (కొండపర్తి), అన్వేష్ (వెంకటాపురం) విద్యార్థులు బహుమతులు పొందారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, సారయ్య, మహేందర్‌రెడ్డి, లక్ష్మి, అశోక్, విజయ భాస్కర్, బాబు, రాము, కిరణ్, యాదయ్య, భవన్, రేవతి, నర్సింహచార్యులు పాల్గొన్నారు.

ఆర్థిక క్రమశిక్షణపై అవగాహన



శాయంపేట : విద్యార్థులు ఆర్థిక క్రమశిక్షణపై అవగాహన కలిగి ఉండడం అవసరమని ఎస్‌బీఐ శాయంపేట శాఖ మేనేజర్ రాజేశ్ అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బ్యాంక్ లావాదేవిలు, ఆర్థిక నేరాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే ఆర్థిక క్రమశిక్షణపై అవగాహన కలిగి ఉంటే రేపటి భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవచ్చని అన్నారు. ప్రస్తుత సమాజంలో ఆర్థిక నేరాలు పెరిగిపోతున్నాయని, వాటిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులకు ఏటీఎం పిన్ నంబర్, ఓటీపీలు తెలియకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వెల్లడించారు. అనంతరం నిర్వహించిన సైన్స్ ఫేయిర్‌లో విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలు తిలకించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రజని, విడ్స్ స్వచ్ఛంద సంస్థ కౌన్సిలర్ క్రాంతికుమార్, విజయ్, ప్రసాద్ పాల్గొన్నారు.

రేషన్‌బియ్యం పట్టివేత

ఆత్మకూరు : తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయించేందుకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. మల్కపేట గ్రామానికి చెందిన కన్నం చిరంజీవి లబ్ధిదారుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసిన 5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అధిక ధరకు కోళ్లఫామ్‌కు విక్రయించేందుకు వెళ్తుండగా కొత్తగట్టు సమీపంలో పట్టుకున్నట్లు తెలిపారు. బియ్యం సీజ్‌చేసి ట్రాలీని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

కేయూ క్యాంపస్: విద్యార్థులు తమ ఆరోగ్యర పట్ల నిర్లక్ష్యం వహించొద్దని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడి సూచించారు. కాకతీయ యూనివర్సిటీలోని స్టూడెంట్స్ వెల్ఫేర్ సెల్ ఆధ్వర్యంలో మెడికవర్ ఆస్పత్రి సహకారంతో విద్యార్థినులకు ఉచిత వైద్యశిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న నార్కోటిక్ ఏసీపీ సైదులు

- వరంగల్ నార్కోటిక్ ఏసీపీ సైదులు

కమలాపూర్ : యువత, విద్యార్థులు గంజాయి, డ్రగ్స్, గుట్కా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వరంగల్ నార్కోటిక్ ఏసీపీ సైదులు సూచించారు. పోలీస్ జాగృతి కళా బృందం ఆధ్వర్యంలో కమలాపూర్‌లోని ఎంజేపీ బాలుర గురుకుల కళాశాలలో శుక్రవారం యాంటీ డ్రగ్స్, సైబర్ క్రైమ్స్, డయల్ 100, షీ టీమ్స్, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు గంజాయి, డ్రగ్స్, గుట్కా వంటి మత్తు పదార్థాలకు బానిసలై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. యువత, విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. చదువుపై దృష్టి సారించి మంచి ర్యాంక్‌లు సాధించాలని అన్నారు. తల్లిదండ్రుల ఆకాంక్షను నెరవేరుస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. గంజాయి విక్రయం, సేవించడం నేరమని, ఇందుకు సంబంధించి 8712584473 నంబరుకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. గంజాయి, డ్రగ్స్‌కి సంబంధించి ప్రొజెక్టర్ ద్వారా షార్ట్ ఫిల్మ్ ప్రదర్శించి అవగాహన కల్పించారు. వాల్ పోస్టర్లు ప్రదర్శించి డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం అవుతాయని విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని అన్నారు. చదువుపై మాత్రమే దృష్టి పెట్టాలని చెడు స్నేహానికి దూరంగా ఉండాలన్నారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరిగిపోయాయని, సైబర్ క్రైమ్‌కు గురైతే వెంటనే 1930 నంబరుకు కాల్ చేయాలన్నారు. నార్కోటిక్ ఎస్సై రాజు, కళాశాల ఏటీపీ హరీష్, కళా బృందం ఇన్‌చార్జ్ నాగమణి, హెడ్ కానిస్టేబుళ్లు విలియమ్, రత్నయ్య, హోంగార్డులు శ్రీనివాస్, చిరంజీవి, స్థానిక పోలీసు సిబ్బంది, కళా బృందం సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి



కమలాపూర్ : ఎగ్జిబిట్స్‌ను పరిశీలిస్తున్న ఆర్సీఓ



శాయంపేటలో..



వేలేరులో..

విద్యకు 15శాతం బడ్జెట్ కేటాయించాలి

హసన్‌పర్తి: బడ్జెట్‌లో విద్యకు 15శాతం నిధులు కేటాయించాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు డీబీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. ఎల్లాపురంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి హసన్‌పర్తి తహసీల్దార్ కార్యాలయం వరకు ఈ యాత్ర సాగింది. అనంతరం తహసీల్దార్ చల్లా ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్ మాట్లాడుతూ అందరికీ సమానమైన, నాణ్యమైన విద్యనందించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో కనీస సదుపాయాలు కల్పించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 27శాతం పాఠశాలల్లో మూత్రశాలలు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, డీబీఎఫ్ నాయకులు నరేష్, సంపూర్ణ, అనిత, కొమురయ్య, సదానందం, దాస్ పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న డీబీఎఫ్ నాయకులు

జాతీయ సదస్సు పోస్టర్ల ఆవిష్కరణ



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో 75 ఇయర్స్ ఆఫ్ ఇండియన్ కాన్‌స్టిట్యూషన్ – మైల్ స్టోన్స్ – ఇష్యూస్ అండ్ చాలెంజెస్ అనే అంశంపై ఈనెల 18, 19వ తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ రాజమణి తెలిపారు. ఈమేరకు సదస్సు పోస్టర్లను కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేయూ పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ సురేష్‌లాల్, డాక్టర్ చిర్రరాజు, పుల్లూరు సుధాకర్, గాదె సమ్మయ్య, ప్రొఫెసర్ మనోహర్, మల్లికార్జున్ రెడ్డి, శ్రీనివాస్, ప్రొఫెసర్ రామనాథ్ కిషన్ పాల్గొన్నారు.

వ్యవసాయరంగం బలోపేతంలో కీలకపాత్ర

- ముల్కనూరు సహకార సంఘం బ్యాంక్ చైర్మన్ ప్రవీణ్‌రెడ్డి



మాట్లాడుతున్న అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి

ఎల్కతుర్తి : వ్యవసాయ రంగం అభివృద్ధిలో సహకార సంఘాలు కీలకపాత్ర పోశిస్తున్నాయని ముల్కనూరు సహకార సంఘం బ్యాంక్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. ఫిబ్రవరి 24నుంచి 28 వరకు కెన్యాలోని మొంబాసా నగరంలో అండర్‌స్టాండింగ్ ది మోడల్ ఆఫ్ కోపరేటివ్స్ అండ్ అగ్రికల్చరల్ సిస్టమ్స్ స్టడీలో భాగంగా కెన్యాలో నిర్వహించిన నీడక్ జనరల్ అసెంబ్లీ, ఎగ్రికల్చర్ టీవ్ కమిటీ సమావేశంలో అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి హాజరై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భీమదేవరపల్లి మండలం ముల్కనూరు సొసైటీలో చేపడుతున్న అనేక కార్యక్రమాలతో పాటు అభివృద్ధిని సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో రైతులకు అందిస్తున్న పలు రకాల సేవలు, అభివృద్ధిని వివరించారు. బ్యాంక్‌లో వచ్చిన లాభాలను సైతం తిరిగి రైతులకు బోనస్, తదితర రూపాల్లో అందజేయడం జరుగుతుందన్నారు. కాలానికి అనుగుణంగా రైతులకు శ్రమ తగ్గించడం కోసం వ్యవసాయ రంగంలో వినియోగిస్తున్న నూతన టెక్నాలజీని సద్వినియోగం చేసుకుంటూ నూతన పరికరాల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను వివరించారు. అనంతరం అక్కడ విజయవంతమైన వ్యవసాయ, క్రెడిట్ సహకార సంఘాలచే నిర్వహించబడుతున్న వినూత్న వ్యూహాలు, సభ్యుల ఓటింగ్‌తో సహా కీలక నిర్ణయం తీసుకునే ప్రక్రియలను పరిశీలించారు. నీడక్ చైర్మన్ పంకజ్‌కుమార్ భన్సల్, ఇఫ్‌కో చైర్మన్ దిలీప్ సంఘానీ పాల్గొన్నారు.

మహిళలు, బాలికల సంక్షేమానికి కృషి చేయాలి

- జిల్లా సంక్షేమాధికారి జయంతి



మాట్లాడుతున్న జయంతి

ఆత్మకూరు : మహిళలు, బాలికల సంక్షేమానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని హనుమకొండ జిల్లా సంక్షేమ శాఖ అధికారి జయంతి అన్నారు. శుక్రవారం సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో లింగాధారిత హింస నివారణ, పరిష్కారంపై అంగన్‌వాడీ టీచర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిత్యం మహిళలు కుటుంబంలోని అందరి శ్రేయస్సు కోసం ఆలోచిస్తారని, బాధ్యతలు, పనులతో కష్టపడతారని గుర్తుచేసారు. అలాంటి మహిళలు తమ నైపుణ్యాలు, విద్యపై దృష్టి పెట్టాలని సూచించారు. తప్పనిసరిగా వ్యక్తిగత, సామాజిక, ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. గ్రామాల్లోని మహిళలు సమస్యలను కూడా ఎదుర్కొనే విధంగా ఉండాలని అన్నారు. చట్టాలు, ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అండగా ఉన్నాయని అన్నారు. సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ కవిరాజ్, సీడీపీఓ స్వాతి, సమన్వయకర్త అడ్వొకేట్ సత్య, పోషణ అభియాన్ కో ఆర్డినేటర్ సుమలత, పరకాల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఏసీడీపీఓ భాగ్యలక్ష్మి, సూపర్ వైజర్స్ పద్మావతి, రాణి, నసీమ, ఉమ, సర్వోదయ సంస్థ ప్రతినిధులు ఇందిర, రవీందర్, శ్రీలత, ఆత్మకూరు, దామెర అంగన్‌వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

బేటీ బచావో– బేటీ పడావోపై అవగాహన



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

నడికూడ : మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బేటీ బచావో– బేటీ పడావో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా సాధికారత జెండర్ స్పెషలిస్ట్ వన్నం స్వర్ణలత మాట్లాడుతూ.. ఆడపిల్లల చదువు అవనికి వెలుగు అని, ఆడపిల్లలను రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, అబార్షన్లు చేసినవారిపై టోల్‌ఫ్రీ నంబర్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, ఉమెన్ హెల్ప్ లైన్ 181కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత జెండర్ స్పెషలిస్ట్ మెరగు మానస, ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన్, ఉపాధ్యాయులు దేవ, రవీందర్, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, సంధ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

శాయంపేట : ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఎంసీపీఐయూ జిల్లా సహాయ కార్యదర్శి రవీందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల అమలుకు కావాల్సిన నిధులు రానున్న బడ్జెట్‌లో కేటాయించాలని కోరారు. నిధుల సేకరణ కోసం వంద కోట్లు ఆస్తి పైబడి ఉన్న వారందరికీ ప్రజా సంక్షేమ టాక్స్ వసూలు చేయాలని అన్నారు. విద్యా, వైద్యం, మహిళా, యువజన సంక్షేమం కోసం బడ్జెట్‌లో పెద్దపీట వేయాలని అన్నారు. అసైండ్ భూముల్లో ఉన్న పేదలకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. ఆయన వెంట నాయకులు పెంట తిరుపతి, మహేందర్‌రెడ్డి, రాజన్న, రంజిత్, సమ్మయ్య ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

- మాజీ ఎమ్మెల్యే భిక్షపతి



మాట్లాడుతున్న భిక్షపతి

పరకాల : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన, ఎస్సీ వర్గీకరణతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, కాంగ్రెస్ పార్టీ పరకాల పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని 1,2,3 వార్డుల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఆయన హాజరై మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలను స్ఫూర్తిగా తీసుకుని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ రాంమూర్తి, కుంకుమేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ప్రచారం చేయాలి



మాట్లాడుతున్న రమేశ్

ఆత్మకూరు : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పనులను కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటింటికీ తెలియజేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్ సూచించారు. మండలంలోని కటాక్షపూర్, హౌజ్‌బుజుర్గు, నీరుకుళ్ల, పెంచికలపేట గ్రామాల్లో శుక్రవారం పార్టీ కార్యకర్తల సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ, కుల గణన చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆత్మకూరు ఏఎంసీ చైర్ పర్సన్ బీరం సునంద సుధాకర్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, మండల సమన్వయ కమిటీ సభ్యులు పర్వతగిరి రాజు, కంచె రవికుమార్, రజనీకర్, ఏరుకొండ రవీందర్‌గౌడ్, వరుణ్ గాంధీ పాల్గొన్నారు.